క్లుప్తంగా

అశోక్‌రాజుకు మాతృ వియోగం



అశోక్‌రాజును పరామర్శిస్తున్న మంత్రి ఆర్కే రోజా



నరసమ్మ(ఫైల్)

నారాయణవనం: స్థానిక సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ అశోక్‌రాజు తల్లి నరసమ్మ(82) శనివారం రాత్రి మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె తిరుపతిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి కన్నుమూశారు. సోమవారం ఉదయం స్వగ్రామమైన విజయపురంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

మంత్రి ఆర్కే రోజా పరామర్శ

విజయపురం : సిద్ధార్థ కళాశాలల చైర్మన్ అశోక్‌రాజును మంత్రి ఆర్కేరోజా పరామర్శించారు. ఆదివారం విజయపురం వెళ్లి అశోక్‌రాజు తల్లి నరసమ్మ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. మంత్రి వెంట ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, నార్పరాజు, శివరాజు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఫేస్‌బుక్‌తో టోకరా వేసిన కి'లేడి'



మాధవీలతారెడ్డి ఫేస్‌బుక్ ప్రొఫైల్



మాధవి లతారెడ్డి (ఫేస్‌బుక్‌లోని చిత్రం)

పాకాల : ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళ సాయంత్రం ఇచ్చేస్తానంటూ డబ్బు తీసుకుని తన ప్రొఫైల్‌ను బ్లాక్ చేసిందని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. వివరాలు.. పాకాల మండలానికి చెందిన వ్యక్తికి ఫేస్‌బుక్‌లో మాధవీలతారెడ్డి అనే యువతి పరిచయమైంది. కొంచెం అమౌంట్ ఇస్తే తిరిగి సాయంత్రం ఇస్తానని చెప్పింది. కుంపటి మాధవి లతారెడ్డి పేరుతో ఫెడరల్ బ్యాంక్‌లో ఉన్న తన ఖాతా నంబర్ మెసేజ్ పెట్టింది. నగదు బదిలీ చేసిన తర్వాత స్క్రీన్‌షాట్ తీసి తన వాట్సాప్ నంబర్‌కు పెట్టాలని కోరింది. అతను అకౌంట్ నంబర్‌కు నగదు బదిలీ చేసేందుకు ప్రయత్నించి వీలుకాకపోవడంతో ఆమెకు చెప్పాడు. అనంతరం ఆమె పంపిన స్కానర్‌కి ఆమె అడిగిన నగదు పంపాడు. సుమారు 6 నుంచి 7 గంటలు అవుతున్నా ఆమె తిరిగి నగదు పంపించలేదు. దీంతో అతను ఆమెకు మెసేజ్ చేశాడు. ఆమె వెంటనే ఫేస్‌బుక్‌లో అతన్ని బ్లాక్ చేసింది. మాధవీలతారెడ్డి తనను మోసం చేసిందని గ్రహించిన అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.మోసానికి పాల్పడిన మహిళ తిరుపతిలోని ఓ పేరొందిన ప్రైవేట్ కళాశాలలో ఇంటర్, ఆ తరువాత బయట రాష్ట్రంలో విద్యాభ్యాసం పూర్తి చేసి, ప్రస్తుతం గన్నవరం ఎయిర్‌పోర్టు, బెంగుళూరులోని కెంపేగూడ ఎయిర్‌పోర్టులో పనిచేస్తున్నట్టు, అలాగే హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్ట్‌లో డేటా అనలిస్ట్‌గా పని చేస్తున్నట్టు ఫేస్‌బుక్‌లోని తన ప్రొఫైల్లో పేర్కొంది. విమానాల్లో వివిధ మార్గాల్లో ప్రయాణించినట్లు పోస్టులు పెట్టింది. ఇలా హైప్రొఫైల్‌తో మరెందరినో మోసం చేసి ఉండవచ్చనని, మాధవిలతారెడ్డి మరెవరినీ మోసం చేయకుండా చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులను కోరినట్లు వివరించారు.

ఈవీ తయారీ కేంద్రం పరిశీలన

యాదమరి: మండలంలోని మోర్ధానపల్లె వద్ద బీఎంఆర్ సంస్థల అధినేత బి.మోహన్ రెడ్డి ప్రారంభించిన ఎలక్ట్రికల్ బైక్‌ల తయారీ కేంద్రాన్ని అటవీ, విద్యుత్, పర్యావరణ శాఖ మంత్రి పరిశీలించారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన బైక్‌ల తయారీ కేంద్రాన్ని, తయారు చేసిన బైక్‌లను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఆయనతోపాటు చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి పాల్గొన్నారు.

500 మద్యం బాటిళ్లు సీజ్

- ఇద్దరి అరెస్టు

పిచ్చాటూరు: మండలంలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 500 బాటిళ్ల మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. వెంగళత్తూరు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నగరి వైపు వెళుతున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా, అందులో పాండిచ్చేరికి చెందిన 500 మద్యం బాటిళ్లు ఉండడంతో ఆటో సహా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్న జగదీష్, వేలును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షేమ పథకాలే గెలుపు అస్త్రాలు



హాజరైన నాయకులు, బూత్ కమిటీ సభ్యులు



వైఎస్సార్ సీపీకి విజయానికి సిద్ధం అని పిడికిలి బిగించి నాయకులతో కలిసి ప్రకటిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- ఇది పేద ప్రజలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధం
- కలిసికట్టుగా పనిచేస్తే 65వేల మెజార్టీ తథ్యం
- బాబు కుటిల ప్రయత్నాలు తిప్పికొట్టాలి
- బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపు

గంగవరం: పేదలు, పెత్తందారులకు మధ్య జరిగే ఎన్నికల యుద్ధంలో జగనన్న సంక్షేమ పథకాలే విజయానికి అస్త్రాలని, వీటితో ప్రతిపక్షాలను చీల్చి చెండాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. పలమనేరు, గంగవరం, పలమనేరు రూరల్ మండలాల వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ సభ్యులతో మేము సిద్ధం-మా బూత్ సిద్ధం సమావేశం ఆదివారం స్థానిక లయన్స్‌క్లబ్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే వారికి దిశా నిర్దేశం చేశారు. గడచిన 58 నెలలు రాష్ట్రంలో సంక్షేమ పాలనను ప్రజలకు అందించామని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఈ 58 రోజులూ అందరూ కలసికట్టుగా పనిచేసి పార్టీని గెలిపించాలన్నారు. ప్రతి ఎన్నికల్లో అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తూ అడ్డదారిలో అధికారంలోకి రావాలని కుటిల యత్నాలు చేస్తున్న చంద్రబాబు ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలన్నారు. రాజకీయాల్లో 45 ఇయర్స్ ఇండస్ట్రీ అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబుకు జగనన్న భయం పట్టుకుంది కాబట్టే ఒంటరిగా పోటీ చేయడం చేతగాక కూటమి ఏర్పాటు చేసుకున్నారని అపహాస్యం చేశారు. అధికారం రావాలి..రాష్ట్రాన్ని దోచుకోవాలనే ఆలోచన తప్పితే ప్రజలకు మంచి చేయాలనే స్పృహ బాబుకు లేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ పాలనలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి, అందిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు చాటిచెప్పాలని, తద్వారా ప్రజలు మళ్లీ ఫ్యాను గుర్తుకే ఓట్లు వేసేలా చూడాలన్నారు. అలా చేసి ఈసారి ఎన్నికల్లో పలమనేరు నుంచి 60 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీని జగనన్నకు కానుకగా ఇద్దామన్నారు. ఏ బూత్‌లో అయితే మెజారిటీ పెరిగిందో ఆ బూత్‌కి రూ.10 లక్షలు కానుకగా ఇస్తానని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. మీ కుటుంబంలో మంచి జరిగి ఉంటేనే మాకు ఓటేయండి అనే దమ్మున్న ముఖ్యమంత్రి దేశంలో జగనన్న ఒక్కరే అని, ఇలా ప్రజల్లోకి వెళ్లి ఓట్లడిగే ధైర్యం టీడీపీ కూటమికి ఉందా? అని సూటిగా ప్రశ్నించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌రెడ్డి, పలమనేరు ఏరియా ఆసుపత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీక్రిష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, గంగవరం, పలమనేరు మండలాల సర్పంచుల సంఘం అధ్యక్షులు గిరిరాజారెడ్డి, విశ్వనాథరెడ్డి, కౌన్సిలర్లు మండీ సుధ, శ్యామ్‌సుందర్, కోదండరామయ్య, సచివాలయాల మండల కన్వీనర్ వినోద్‌రెడ్డి, నాయకులు చలపతిరెడ్డి, రంగన్న, రాజారెడ్డి, కిషోర్, రమేష్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పుంగనూరు: పట్టణంలో కోనేటి వద్ద ఉన్న శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభించినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు విలేకరులకు తెలిపారు. బ్రహ్మోత్సవాలు ఈనెల 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. తొలిరోజు వేకువజామున స్వామివారికి అభిషేక పూజలు, సాయంత్రం 6 గంటలకు సేనాధిపతి ఉత్సవం, రాత్రి అంకురార్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించామని, సోమవారం ధ్వజారోహణం, శ్రీవారి బ్రహ్మోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

కేంద్ర బలగాల కవాతు



రామకుప్పం: మండలంలోని బల్ల, కెంచనబళ్ల, కొల్లుపల్లె, కొంగనపల్లె, రామకుప్పంలో ఆదివారం కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీధర్, కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్ రెడ్డి మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు, ప్రతి ఓటరుకు ధైర్యం కల్పించేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ శివకుమార్, పోలీసులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమం..

- ఎన్నికల ప్రచారంలో భరత్



నంజంపేటలో కరపత్ర ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

శాంతిపురం: రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి నవరత్న సంక్షేమ పథకాల ఫలాలను తమ ప్రభుత్వం అందజేసిందని, ప్రతిపక్షనేత ఎమ్మెల్యేగా ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నా వివక్ష చూపకుండా అభివృద్ధి పనులు చేశామని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ చెప్పారు. ఆదివారం మండలంలో నాయకులతో కలిసి భరత్ జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మేలు గురించి చెప్పారు. ఫ్యాను గుర్తుపై ఓట్లేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. రాళ్లబూదుగూరు, శివరామపురం, 121 పెద్దూరు, ఎంకె పురం, అబకలదొడ్డి, కడపల్లె పంచాయతీలలో ఆదివారం ఇంటింటా పార్టీ నాయకులు ప్రచారం చేయగా, శివరామపురం పంచాయతీ నంజంపేటలో భరత్ ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పుంగనూరు: పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. సోమవారం నుంచి టెన్త్ పరీక్షలు మొదలవుతాయని, 28వ తేదీతో ఇవి ముగుస్తాయన్నారు. 8 పరీక్ష కేంద్రాలలో 1,652 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇందు కోసం 72 మంది ఇన్విజిలేటర్లు, స్క్వాడ్, డిపార్టుమెంటల్ అధికారులను నియమించామన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలంలోని 506 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలను రాయనున్నట్టు ఎంఈఓ కేశవరెడ్డి ఆదివారం తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, రెగ్యులర్ విద్యార్థులు 490 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 16 మంది పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించినట్టు చెప్పారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మండలంలో 8 ప్రభుత్వ, ఒక ప్రవేటు ఉన్నత పాఠశాలలకు చెందిన 304 మంది టెన్త్ విద్యార్థులకు రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ ఇందిర ఆదివారం తెలిపారు. రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో 167 మంది, రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాలలో 137 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, 16 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జెరాక్స్ సెంటర్లను మూసివేయాలని కోరారు.

పలమనేరులో..

పలమనేరు: మండలంలో పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవో లీలారాణి తెలిపారు. ఆదివారం పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆదివారం ఆమె పరిశీలించారు. మండలంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో 1206 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు. అనిన కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 బాలసుందరం, ఆయా స్కూళ్ల హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు

- పార్టీల బ్యానర్లు, హోర్డింగ్స్ తొలగింపు
- రాజకీయ పార్టీల సభలు, సమావేశాలపై వీడియో రికార్డింగ్
- అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై షాడో పార్టీ నిఘా
- ఎఫ్ఎస్టీ, ఎంసీసీల కోసం ప్రత్యేక బృందాలు
- పలమనేరు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీఓ మనోజ్ రెడ్డి

పలమనేరు: ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేస్తామని పలమనేరు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇప్పటికే రాజకీయ పార్టీల బ్యానర్లు, హోర్డింగ్స్‌ను తొలగించినట్టు చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటివరకూ 2,66,739 ఓటర్లు ఉన్నారని, ఎన్నికల కోసం మొత్తం 288 పోలింగ్ కేంద్రాలు, 1,728 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే 87 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, అక్కడ వెబ్ కాస్టింగ్, ప్రత్యేక కేంద్ర బలగాల బందోబస్తు ఉంటుందన్నారు. ఎన్నికల కోసం 34మంది సెక్టోరల్ అధికారులు, 37మంది రూట్ అధికారులను నియమించినట్టు చెప్పారు. సాధారణ ప్రజలు సైతం ప్రయాణ సమయంలో రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లరాదని, ఒకవేళ అంతకుమించి తీసుకెళ్తున్న పక్షంలో అది ఎందుకోసమో చెప్పాల్సి ఉంటుందన్నారు. పలమనేరు నియోజకవర్గం రెండు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండడంతో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, అక్కడ అవసరమైతే వీడియో రికార్డింగ్ సైతం ఏర్పాటు చేస్తామన్నారు. ఇక ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించామని, ఎంసీసీ టీంలలో ఆయా మండలాల ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు విధుల్లో ఉంటారని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, తహసీల్దార్ రంగనాయకులు, ఏఓ కుప్పుస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

నేనే క్యాండిడేట్..కాదు నేను..!

పలమనేరు కాంగ్రెస్ రూటే సెపరేటు

- పట్టణంలో ఎవరికి వారే ప్రచారం
- నవ్వుకుంటున్న జనం



పలమనేరు: పలమనేరులో నియోజకవర్గంలో ప్రధాన పార్టీలకంటే కాంగ్రెస్ టిక్కెట్లు కథ చర్చనీయాంశమైంది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలై వేర్వేరుగా ఎన్నికల ప్రచారం చేయడం గమనార్హం! రాష్ట్ర విభజనకు కారణమైందనే ఆగ్రహంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆ పార్టీకి రాష్ట్రంలో ఉనికి కూడా లేని విధంగా గత ఎన్నికల్లో తీర్పునిచ్చారు. అడపాదడపా స్టేట్‌మెంట్లు ఇవ్వడం మినహా ఆ పార్టీ నాయకులు చేసిందంటూ ఏమీ లేదు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రభావం ఇక్కడ కూడా పడింది. ఇప్పటివరకు ఇక్కడ కాంగ్రెస్ పార్టీ ఎక్కడా అభ్యర్థులను ప్రకటించలేదని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పార్థసారథి రెడ్డి వర్గం ప్రచారం చేస్తుండగా, ఇటీవల ఆ పార్టీలోకి వచ్చి స్థానికంగా హంగామా చేస్తున్న బీపీఎం శివశంకర్ మైనారిటీ నాయకులతో కలసి తానే పలమనేరు అభ్యర్థినంటూ ప్రచారం మొదలెట్టారు. పైగా బంపర్ మెజార్టీతో గెలుస్తానని ఆయన చెప్పడంపై కాంగ్రెస్ నాయకులే విస్తుపోతున్నారు. ''అసలోళ్లు ఎక్కడో ఉంటే కొసరోళ్లను పట్టేదానికి కావడం లేదబ్బా!..పోయిన ఎన్నికల్లో నోటాకంటే తక్కువ ఓట్లు వచ్చిన పార్టీకి ఇప్పుడు అంత సీనుందా!?'' అని అని జనం నవ్వుకుంటున్నారు. మరో వైపు ఇక్కడున్న కొందరు కాంగ్రెస్ వాళ్లకు మాత్రం ఈ అభ్యర్థులతో ఎన్నికల వరకూ చేతి ఖర్చులకు కొదువ లేకుండా పోయింది. ఇద్దరు నేతలను వీరే పిలిపించి, డబ్బు ఖర్చు పెట్టించి కార్యక్రమాలను చేయిస్తుండడం కొసమెరుపు. ఏదేమైనా కాంగ్రెస్ టికెట్ కోసం ఆ ఇద్దరు చేస్తున్న కార్యక్రమాలు, వారే సొంతంగా ఇస్తున్న హామీలను చూసిన జనం ఔరా! అని ముక్కున వేలేసుకుంటున్నారు.

మోటార్ సైకిళ్ల ర్యాలీతో జోరుగా ఎన్నికల ప్రచారం



పుంగనూరు: మంగళంలో మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, నాగరాజారెడ్డి

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ , ప్రజలను చైతన్యపరిచేందుకే మోటారుసైకిల్ ర్యాలీ ప్రారంభించినట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లె చెంగారెడ్డి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి ఆధ్వర్యంలో మంగళం, భీమగానిపల్లె, గెరిగపల్లె, ఎంసీ పల్లె, మోదుగులపల్లె, సుగాలిమిట్ట, నేతిగుట్లపల్లె పంచాయతీలలో పెద్ద ఎత్తున మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ, పుంగనూరు అసెంబ్లీ అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా అందించిన సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తున్నట్టు చెప్పారు. ర్యాలీలో ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ స్థానిక శాఖ అధ్యక్షుడు జయరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, పార్టీ నాయకులు రాజారెడ్డి, రామమోహన్‌రెడ్డి, రెడ్డెప్ప, నంజుండప్ప, శంకరప్ప, సుబ్రమణ్యం, విజయకుమార్, లోకేష్, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో....

పట్టణంలోని నానబాలవీధి, ఎన్ఎస్.పేట, సుబేదారువీధి ప్రాంతాలలో సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, కార్యదర్శి మహబూబ్‌బాషా, రహమత్ నగర్‌లో ఆదివారం ప్రచారం చేశారు. అలాగే మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లలిత, కౌన్సిలర్లు అర్షద్‌అలీ, కిజర్‌ఖాన్, జయభారతి, సాజిదాబేగం, ఆదిలక్ష్మి, రాఘవేంద్ర, భారతి తాము ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులలో ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. నాయకులు జావీద్, మమ్ము, సలామత్ పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోట పంచాయతీ అంకుతోటపల్లెలో వైఎస్సార్‌సీపీ నేతలు మోటార్ సైకిళ్ల ర్యాలీతో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీనేతలు దాదాపు 1500 బైక్‌లతో మండలంలోని 106 గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుకు ఓటువేద్దాం..జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం.. అని నినాదాలతో హోరెత్తిస్తూ ర్యాలీ చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీవీ మిథున్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మాజీ ఎంపీపీలు రెడ్డిప్రకాష్, వెంకటరెడ్డి, వీరశైవ జంగమ సంఘ జిల్లా అధ్యక్షుడు నాగరాజ, సర్పంచులు, ఎంపీటీసీలు, నేతలు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మండల కేంద్రంతోపాటు బోడిపాటివారిపల్లె, బొమ్మయ్యగారిపల్లె, పెద్దగొట్టిగల్లు, బండకిందపల్లె గ్రామ పంచాయతీలలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బైక్ ర్యాలీతో జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి గెలుపు కోసం బైక్ ర్యాలీతో ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. తండ్రీకొడుకులను రికార్డు స్థాయి మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి, పార్లమెంట్‌కు పంపాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, విజయశేఖర్, కరీముల్లా, కోటా వెంకటరమణ, అలీంఖాన్, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, సూర్య నారాయణ రెడ్డి, యుగంధర్ రెడ్డి, యర్రంరెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, హరికృష్ణారెడ్డి, మదనమోహన్‌రెడ్డి, సిద్ధరామిరెడ్డి, ప్రసాద్‌నాయుడు, ప్రకాష్ రెడ్డి, నాగిరెడ్డి, అన్సర్‌బాషా, సైఫుల్లాఖాన్, శ్రీనాధనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరులో ప్రచారం చేస్తున్న ఫక్రుద్దీన్ షరీఫ్, మహబూబ్ బాషా



చౌడేపల్లె: అంకుతోటపల్లెలో..



రొంపిచెర్ల మండలంలో..